కథానిక :

# లచ్చి

— శ్రీ గూడూరి సీతారాం

తండ్రి, పెద్దకొడుకు కలసి వాళ్ళయింటి ప్రక్కనే చిన్నగుడిసెను వేస్తున్నారు. నడిపికొడుకు రంగడు దీర్ఘాలోచనల్లో మునిగిపోయి పాత గుడిసె ముందు కూర్చున్నాడు. అప్పుడే ఊళ్ళోనుండి వొస్తున్న భార్య కనిపించగానే పాలిపోయిన రంగని ముఖంలో అప్రయత్నంగా చిరునవ్వు తొణికింది. "మా అందట్లో లచ్చే నయం. అది చేసినంతపని మేమెవ్వరం పెయ్యలేం. అందానికి అందం ఉంది, తెలివికి తెలివి ఉంది." కొంచం దూరాన తల్లి పొరుగింటావిడతో మాట్లాడుతుంటే విని మరీ సంతోషపడ్డాడు రంగడు. ఇందరు ఇన్ని మాటలు అంటున్నా, అందరు అన్ని పనులు చేసిపెడుతున్నా రంగని కెందుకో ఏమో బాధగానే ఉంది. ఉండదుమరీ! యిరువై ఏండ్లు ఆ యింట్లో పెరిగినాడు. వాళ్ళతో కలసి తిరిగినాడు. ఈ రోజు వేరై పోతున్నాడు.

బిచ్చగాళ్ళల్లో ఈ ఆచారం ఉంది. కోడలు కాపరానికి రాగానే కొడుకు వేరే ఇంట్లో ఉండి వాళ్ల సంపాదనమీద వాళ్లే బ్రతకాలి. అందుకే వాళ్ళల్లో పిల్లలను చిన్ననాటినుండే వెంటతీసుకపోయి బిచ్చ మెత్తడం నేర్పుతారు. పిల్ల వాళ్ళనే పంపి బిచ్చమెత్తక రమ్మంటారుకూడా!

రంగడు కొత్తకాపరం పెట్టినాడు. లచ్చికి కాపురాన్ని గుట్టుగా నడిపించాలన్న సంగతి బాగా తెల్సు. వాళ్ళకు ఆస్తి అంటూ ఏమీ లేదు. ఒక ఊరంటూ ఉంటేనా భూమి బుట్రా, యిల్లూ గిల్లూ ఉండేది. ఎక్కడ పొట్ట బోసుకోవడానికి అనువుగా వుంటే అక్కడికే వెళ్లిపోతారు. రంగని పాలుకు వచ్చినవి రెండు పాతకుండలు, ఒక కమ్మకోతకత్తి, రెండు అంబలిపోసుకునే బుర్రలు, రెండు బిచ్చమెత్తుకునే కమ్మజోలెలు. ఈ ఆస్తితోనే రంగడు కాపురాన్ని మొదలుపెట్టినాడు. వాడు ప్రొద్దంతా ఒక్క బిచ్చమెత్తడానికే పోడు ప్రొద్దున్నేలేచి ఈదులవైపు వెళ్ళి కమ్మగోసి తెస్తాడు. భోజనపు సమయానికి వాడి పూర్తికూడును అడుక్కొచ్చుకుంటాడు. సాయంకాలానికి ఎండ్రికాయలో, చేపలో పట్టడానికి వెళ్లుతాడు. వాటిని ఊళ్లో అమ్ముతాడుకూడా! అప్పుడప్పుడు మందుచెట్లను త్రవ్వుకొచ్చి నాలుగు పైసలు సంపాదించి తాళ్ళల్లకు వెళ్ళి కల్లుత్రాగి వొస్తాడు. పెండ్లానికికూడా బుద్ధిపుట్టినప్పుడు ఓ బుంగం

డంత కల్లు తీసుకొస్తాడు. లచ్చికూడా ఒక నిమిషం వృథాచేయకుండా పని చేస్తుంది. మొగడు తెచ్చిన కమ్మతో చాపలు అల్లుతుంది. రోజుకు ఒకటి రెండు అల్లినవి అల్లినట్లు అమ్మివేస్తుంది. వేళకు వెళ్ళి తనకూ, తనమగనికీ సరిపో యేంత గంజిని, గడుకను అడుక్కొస్తుంది. వాళ్ళిద్దరికీ సరిపోగా మిగిలిన గంజిని, గడుకను అత్తకుగానీ, మరెవ్వరికిగానీ లేకపోతే కుక్కలకుగానీ వేస్తుంది.

వాళ్ళ కాపురం చిలకా గోరెంకల్లా సాగిపోతుంది. లచ్చి బాగా పనిచేసి డబ్బును కూడబెట్టాలంటుంది. రంగడు ఎప్పుడయినా దుబారా ఖర్చుపెడితే కోప్పడుతుంది. అతడు ఆమెకు భయపడకున్నా తన సంపాదనతో వొచ్చిన పైసలనన్నింటినీ భార్యవద్దే ఉంచుతాడు. ఆ గూడెంలో రంగని సంసారాన్ని చూచి అందరూ సంతోషపడుతారు.

వానాకాలం దగ్గరపడజొచ్చింది. ఆ గూడెంలోనివారు ఒక్కొక్కరే వెళ్ళిపోతున్నారు ఎవరి అరను వారుచూసుకొని. రంగనిఅన్న వెళ్ళిపోయినాడు. ఇక మిగిలినవారు నలుగురయిదుగురు మాత్రమే ఉన్నారు. రంగడుకూడా ఎక్కడికయినా వెళ్ళిపోదామనుకున్నాడు. కానీ ఆవూరు విడిచిపెట్టి పోవడం యిష్టంలేదు. ఆ ఊళ్ళోనే ఎక్కడయినా ఒకకాపు నాశ్రయించి కొట్టమును చూచుకోవాలనుకున్నాడు. వాని తండ్రికూడా పోవడానికి తయారయినప్పుడు రంగని మనసంతా కలికలి అయిపోయింది. ఈ జీవితములో మళ్ళీ కలుసు కుంటామో లేమో అని బాధపడ్డాడు. ఆ బాధనోర్వలేక తండ్రితో పోవటానికే రంగడు ముల్లెమూట కట్టినాడు. కానీ ఆశించిన ఆశ్రయం ఆ ఊళ్ళోనే లభిం చింది. ఇక రంగడు అక్కడే స్థిరపడిపోయినాడు గుండెను రాయిచేసుకొని.

ఇప్పుడు నా అన్నవాళ్ళు లేరు. ఆ ఊళ్లో అక్కడక్కడవున్న కొట్టాలల్లో ఎక్కడెక్కడినుండో క్రొత్తవాళ్ళు వచ్చివున్నారు. రంగడు తన పనేమిటో అది చూసుకుంటున్నాడు. సంపాద నేమీ లేదు. సంపాదించిన డబ్బుల్లోనుండి చిల్లిదమ్మిడీకూడా తీయడంలేదు. రోజూ అడుక్కొస్తున్న గంజి, అంబలితోనే కాలం గడుపుతున్నారు.

వాడు పెళ్ళాన్ని ఒక్కనాడుకూడా తప్పత్రాగొచ్చి కొట్టలేదు. చాలా అన్యోన్యంగా నాల్గు చేతులుకలిపి సంసారం చేస్తున్నారు. ఇట్లా వాళ్ళు కాపురం చేస్తుండగా ఒకరోజు పోలీసులువచ్చి రంగన్ని పట్టుకపోయినారు. లచ్చికి కొండ నెత్తిమీద పడ్డట్టయింది. మ్రాన్పడిపోయి గుడిసెముందు ఆ రాత్రికి రాత్రంతా

కూర్చుండిపోయింది. అక్కడ తనకు తెలిసిన తన కులంవాళ్ళెవ్వరూలేరు. ఇక ఏంచేయాలో తెల్వలేదు. తన మొగన్ని వాళ్లెందుకు పట్టుకుపోయినారో ఎంత ఊహించినా ఆమె ఊహకు తట్టలేకపోయింది.

మామవద్దకు పోదామన్నా లచ్చికి వాళ్ళెక్కడుంటున్నారో తెల్యదు. లచ్చి పుట్టినాటినుండి కూడా తనవాళ్ళ నెవరినీ పోలీసులు పట్టుకపోవడం ఎరగదు. ఊళ్ళోకి వెళ్ళి అడిగినా ఎవరికీ ఈ సంగతి తెల్యదన్నారు. ఎక్కడైనా దొంగతనం చేసినాడో ఏమో అన్నారోపూట. ఈ వార్తవిన్న తరువాత సగం చచ్చిపోయిన లచ్చి ప్రాణం పైపైనే ఎగిరిపోయింది. ఇక తన మొగుడు కని పించదేమోనని గజగజ వణకిపోయింది. తను ఒంటరిగా ఎట్లా బ్రతకాలో ఊహించుకుని కడుపంతా చెరువు చేసుకొని ఏడ్చింది.

మూడురోజులు గడిచిపోయినవి. లచ్చి కూడు కుమ్ము లేక ఏడ్చింది ఏడ్చినట్లుగానే ఏడుస్తుంది. తన తల్లిగారింటికి పోదామన్నా వాళ్ళెక్కడుంటు న్నారో తెల్యదు. పోలీసులకు నా మొగనిమీదే అనుమానం రావాలా ? ఇంకె వ్వరూ దొరకలేదా ? పచ్చని కాపురంలో చిచ్చిపెట్టినారే ? నేనేం కావాలి ? నేనెట్లా బ్రతకాలి ? లచ్చి అనేక విధాల ఊహించుకుంటూ కుమిలిపోయింది. లచ్చికి రంగన్ని ఎక్కడికి పట్టుకుపోయినారో కూడా తెల్యదు. ఎక్కడికైనా వెళ్ళి కనుక్కుందామన్నా ఆడది. ఏం చేయగలుగుతుంది ? మొగదిక్కు లేని వారి గతి ఇంతేనా ? అని తన్ను తను నిందించుకుంది.

నాలుగోరాత్రి ఇంటికొచ్చినాడు రంగడు. లచ్చికి పోయినప్రాణం లేచి వచ్చింది. మూడు రోజులనుండి కూడులేక శోషవచ్చినట్లున్నా మొగన్ని చూడ గానే లేడిపిల్లలాగా గంతులేసింది లచ్చి. ఎన్నడో వడ్లు దంచబోతే వచ్చిన నూకలతో జావచేసి ముందు పెట్టింది. రంగని తలమీద తల ఆనించి కడుపు నిండారా ఏడ్చింది. వాడు ఇంకేం ఫర్వాలేదని సముదాయించినాడు లచ్చిని.

రంగడు ఇక ఆ ఊళ్ళో ఉండలేక పోయినాడు. దొంగతనం చేయకున్నా ఊళ్ళోఅందరూ'దొంగ'అన్నారు. లేకపోతె పోలీసులు ఊర్కేనేపట్టుకపోతారా? అన్నారు. పాపం, అతన్ని పోలీసులు అనుమానంతో పట్టుకపోయి ఒళ్ళంతా సున్నం సున్నం చేసినారు. లచ్చి రాత్రంతా ఉడుకు నీళ్ళతో కాపింది. వారం రోజుల్లోనే రంగడా ఊరు విడిచి పట్టణం వెళ్ళిపోయినాడు తన కాశ్రయ మిచ్చిన కాపు కరకు మాటలను ఓర్చుకోలేక.

వొచ్చిన క్రొత్తలో ఏమీ బాగనిపించలేదు. ఇన్నాళ్ళూ కష్టపడి సంపాదించిన డబ్బులను వాడవలసి వచ్చింది. లచ్చి బాగా బాధ పడ్డది. మునుపటి ఊళ్ళో దొరికినంత బిచ్చం దొరకడంలే దిక్కడ. తన గూడెంనుండి బిచ్చమెత్త డానికి నాలుగైదుమైళ్ళు నడిచి పోవాలి. అంత దూరం నడిచి రావడం- పోవడం లోనే సంపాదించిన బిక్షం స్వాహా అయిపోతుంది.

పట్టణమంతా క్రొత్తగా ఉంది వాళ్ళకు. పైసలు సంపాదించడమే వొస్తుంది వాళ్ళకు కాని ఖర్చుపెట్టడం మాత్రం రాదు. పుట్టినప్పటినుండి కూడా పైసలుపెట్టి వస్తూ మొదలైనవి కొనుక్కొని బ్రతుకవలసి వొస్తుం దనుకోలేదు లచ్చి. ఈ పాడుపట్నం వొచ్చిన్నుండి అవీ-యివీ తినాలనే బుద్ధి కూడా పుడుతుంది. ఆ పల్లెటూళ్ళల్లో ఉండగా కలో గంజో దొరికేది కాని పైసలు మందులు వేస్తామన్నా దొరక్కపోయేవి. కానీ ఇక్కడ ఎవరింటికి వెళ్ళినా ఓపైసో- అణానో వేస్తారేకాని ఇంత వండుకుంది మాత్రం పడేయరు. అందుకే లచ్చి ఫుట్‌పాత్‌మీద కూర్చొని అమ్మే ముసలమ్మ వద్ద బుడాలో, బజ్జీలో కొనుక్కొని కడుపు నింపుకుంటుంది. మొగుడికీక్కూడా తెస్తుంది.

రంగడూ అంతే!

రోజులు గడచినకొలది రంగనికి బిచ్చమెత్తడం బాగనిపించలేదు. వచ్చే రైలుకు పోయే రైలుకు తీరికలేదు. రంగనికి పైసలు రాకకేం తక్కువలేదు. ప్రతి డబ్బాకువెళ్ళి యాచిస్తాడు. క్రొత్తలో పాటలు పాడకపోయేవాడుకాని ఇప్పుడిప్పుడే పల్లెపాటలు చదువుకుంటూ బిక్షమెత్తుతున్నాడు. ప్రొద్దంతా యాచిస్తే ఒకటో రెండో రూపాయలు దొరుకుతాయి. అన్నం తినాలంటే రూపాయ కావాలి. సంపాదించిందంతా ఖర్చుపెడితే పెళ్ళాం కోప్పడుతుంది. రంగడుకూడా చిరుతిండ్లకు అలవాటుపడ్డాడు. ఉడుకుడుకు చాయెలు త్రాగి పూటలకు పూటలు గడపడం నేర్చుకున్నాడు.

వాళ్ళిద్దరి జీవితాల్లో క్రమక్రమంగా మార్పులొచ్చినవి. ఇద్దరూ సాయం కాలానికి ఇల్లు చేరుకుంటారు. రంగనికన్నా కొంచెముందే లచ్చివచ్చి వంట వండుతుంది. ఇద్దరూ తింటారు. వర్షం పడ్డనాడు రాత్రంతా జాగారంచేయాలి. అట్లాంటి కొంపలుకూడా లేకుండా బజార్లవెంటకూడా కొంతమంది బ్రతుకు తారు.

ఆనాడు పెందరాలే తిరిగివొచ్చినారు. ఇద్దరి ఆదాయము లెక్కపెడితే ఆరు రూపాయలవరకు పోగయింది. చాలా ఆశ్చర్యం కలిగింది. తమయందు

లక్ష్మి ప్రసన్నమయిందని సంతోషపడ్డారు. తెల్లవారి బిచ్చమెత్తడానికి వెళ్ళితే వాలి పైసలు చెల్లవన్నారు. ఒకవేళ ఎవరయినా దానంచేస్తే తీసుకోకూడదని తెలిసింది భార్యాభర్తలకు. పాపం రాత్రిడబ్బు జ్ఞాపకానికి రాగానే ముఖంలో నెత్తురుచుక్కలేకుండా పోయింది. లోలోనే ఏడ్చుకున్నారు. రంగడు వెంటనే ఇంటికి పరుగెత్తుకువచ్చి పెండ్లాం దాచిన డబ్బునంతా వెదకినాడు. రంగడు వెదుకుతుండగనే ఆదరబాదర లచ్చివొచ్చింది. ఇద్దరుకలిసి ఇన్నాళ్ళు సంపాదించిన డబ్బునంతా నూటికి ముప్పయి రూపాయల నష్టంతో కల్దార్లను తెచ్చుకున్నారు.

ఆ రాత్రంతా రంగనికి నిద్రపట్టలేదు. బిచ్చమెత్తుతుండగా అప్పుడప్పుడు యువకులన్నమాటలు చెవుల్లో గింగుర్లెత్తిపోయినవి. ఆ రాత్రంతా యోచనా నిమగ్నుడయినాడు. తెల్లవారి లేస్తూనే ఏదో నిశ్చయాని కొచ్చినట్టు కనిపించినాడు. "ఏమేవ్ ! ఈ పైసలతో ఒకరిక్షాకొంటాను. యెధవబిచ్చ మెవడెత్తుతడే! రాజోలే రోజుకు అయిదారు రూపాయలు సంపాయించొచ్చు. ఏమంటవే" రంగడు తన అభిప్రాయాన్ని పెండ్లాంకు చెప్పినాడు.

లచ్చికిదేం బాగనిపించలేదు. చేతిలోనున్నపైసలను నాశనం చేసుకోవడం తప్ప మరేం లేదనిపించింది. రిక్షాలు నడిపిస్తే శరీరంకూడా తొందరగా పాడయిపోతుందని కూడా వింది. ఇంకెట్లా ఒప్పుకొంటుంది. ససేమిరా వొద్దంది లచ్చి. రంగడు మాత్రం వినలేదు. కొంటానంటే కొంటానన్నాడు. ఈరూపాయలననగా ఒక నెలలో సంపాదించిపెడుతానన్నట్లు మాట్లాడినాడు.

రంగడు రిక్షాను కొన్నాడు. కొన్ని రూపాయలు తక్కువబడితే రిక్షా కొనాలనే సలహానిచ్చిన మిత్రుడే అప్పు రూపాయలనుకూడా ఇప్పించినాడు.

నెత్తురున్న మనిషికాబట్టి రాత్రనక, పగలనక, ఇక్కడికనక, అక్కడికనక తిరుగుతున్నాడు రిక్షాతో రంగడు. పగలు తిండికి తప్పితే మరెప్పుడూ ఇంటికి రాడు. రాత్రి ఎప్పుడో అందరూ పడుకొన్న తరువాత వొస్తాడు. మళ్లీ మబ్బు ఉండగానే వెళ్ళిపోతాడు. లచ్చి ఎప్పటివలెనే బిచ్చమెత్తుతుంది. రంగడు సంపాదించిన దాంట్లో చిల్లర కర్చులకుపోగా రెండో మూడో రూపాయలను లచ్చివద్దే ఉంచుతున్నాడు.

నెల అయిపోగానే అప్పు తీర్చాలనుకున్నాడు రంగడు. మొత్తం ఇవ్వకున్నా, సగమో, పావో, పరకో ఇవ్వాలనే నిశ్చయించుకున్నాడు. కాని తానొకటి తలిస్తే ప్రకృతొకటి చేసినట్లు నెలాఖరు తేదిన రంగని రిక్షాను పోలీ

సులు పట్టుకొన్నారు. రూలు విరుద్ధంగా దీపం లేకుండా నడిపిస్తున్నావని. ఏదో రెండు మూడు రూపాయలిస్తే అయిపోతుందనుకున్నాడు. కానీ అంతటితో ఆ పీడ వదలిపోలేదు. ఈ కేసు పోలీసుల చేతుల్లో నుండి ఇనస్పెక్టర్ల చేతుల్లోకి పోయింది. పద్దెదులనుండి పాతిక యాభై దాక వెళ్ళిపోయింది లంచం. నెత్తురు వడిపి నిద్రనక, అలసటనక సంపాదించిన అంతడబ్బును ఒక్క నిముషంలో నీళ్ళల్లో పోసినట్లు పోసినాడు. లచ్చి కలకలమంది. చెప్పితె వింటేనా అని తిట్టింది. ఏడ్చింది.

రోజులు గడుస్తున్నాకొలది రంగనికి రిక్షా మిత్రులు పెరిగిపోతున్నారు. సంపాదించినదాంట్లో తరుగు బాగానే అవుతుంది. మిత్రులవల్ల సిగిరెట్లు, పానులు, చాయెలు అలవాటైనవి. అప్పుడప్పుడు అందరూ కలిసి సినీమాలకు కూడా వెళ్లేవారు. లచ్చి రంగన్ని ఒక కంట కనిపెడుతూనే ఉంది. ఆ రిక్షా వొచ్చిన్నాడే అది అనుకొంది లేని అలవాట్ల నన్నింటినీ రిక్షా తెచ్చి పెడుతుం దని. అక్కడికి ఎన్నోసార్లు చెప్పిచూచింది. చెప్పినప్పుడు రంగడు ఔనౌనని తలూపేవాడు. కాని ఇంట్లోనుండి కాలు బైట పెడితేనే అన్నీ మరచిపోయే వాడు. ఈ లోకమే వేరుగా ఉండేది వాడికి.

ఇప్పుడు రంగడు పాతచోటలేడు. పట్టణానికి ఓ కొనలో మురికిపేటలో ఉన్నాడు. అక్కడంతా రిక్షా వాళ్లే. అందరూ అద్దె ఇళ్ళల్లోనే ఉన్నారు. లచ్చి బిచ్చమెత్తడం మానేసింది. బోళ్ళు తోమడానికి ఓచోట కుదిరింది. ఉదయ సాయంకాలాలూ అట్లా నాలు గిండ్లలో పనిచేస్తుంది.

సంపాదన ఎంత ఉంటే ఏముంది ? ఎంత చెట్టుకు అంత గాలియట. ప్రతి వస్తువు కొనడమేనాయె. లచ్చి తన జన్మలోనేకాక తన అమ్మమ్మ జన్మలోకూడా కట్టెలుకొని ఎరగదు. కాని లచ్చి కొంటుంది. ఎక్కడైనా ఏరుకొద్దామన్నా వీల్లేదు. లచ్చికంతా సంకటంలో పడ్డట్టు అనిపించింది. ఇదేం బ్రతుకురా బాబు అని బాధపడ్డది. రంగడు మాత్రం పట్టణపు భ్రాంతిలో పడిపోయినాడు. ఇక జీవితమంతా ఇక్కడే గడపాలనే నిశ్చయంతోనే రిక్షాను కొన్నాడు.

లచ్చికి చాలా రాత్రి తెలివైంది. ఇంకా మొగడు ఇంటికి రాలేదు. రోజూ ఈపాటికి వచ్చేవాడే కాని ఈరోజెందుకు రాలేదని ఆలోచిస్తుంది. దీపం వెలిగించింది. చాలాసేపు రంగని కొరకు ఎదిరిచూచింది. తను తిని భర్తకోసం ఉంచిన అన్నంను చూసింది. ఎప్పుడో కుక్కలు తినిపోయినవి. గుండె గుభిల్లు మంది. మొగడెంత ఆకలితో వొస్తాడోనని బెదిరి పోయింది. లచ్చి అట్లా

చూస్తుండగానే రంగడు గడపలో కాలుబెట్టినాడు. కాలు బెడుతూనే తూలి కూలిపోయినాడు. అమాంతంగా లచ్చి రంగనిమీద పడ్డది. ఒళ్ళంతా పుణికి చూసింది. మెల్లిగా లేబట్టి పడక బట్టల్లో పడుకోబెట్టింది. రంగడిట్లా ఎందుకైనాడో లచ్చికి అర్థంకాలేదు. కొంతసేపైన తరువాత వాంతులు చేసుకొన్నాడు. లచ్చి కప్పుడు పూసగుచ్చినట్లర్థమైంది. త్రాగినదంతా వాంతి చేసుకొన్నాడు. లచ్చి ఆ దుర్వాసనను భరించలేక పోయింది. తన మొగుడు ఎంత కల్లు త్రాగినా కక్కుకోడు. వాసన కూడా వేరే విధంగా ఉంది. ఇదేదో క్రొత్తదనుకొంది. పెద్దలను చంపుకున్నంత దుఃఖం పొర్లింది లచ్చికి. రంగడు రోజురోజు కిట్లా చెడిపోతాడని ఆమె కలలో కూడా అనుకోలేదు. కాళ్ళకు, చేతులకు గాయాలు తగిలినవి. నెత్తురునంతా తుడిచి తడిసున్నం పెట్టింది లచ్చి. ఏ తెల్లవారకముందో కాని నిద్రపోలేదు.

లచ్చి తెల్లవారి చెప్పితేనేకాని ఇదంతా తెల్యాదు రంగడికి. రాత్రి జరిగినదంతా భార్య చెపుతుంటే చేటంత ముఖం మొంటంత అయింది. ఛీ...ఛీ... అలాంటిపని కలలో కూడా చేయకూడదనుకుని చెంపలు వాయించుకొన్నాడు రంగడు.

అప్పులవాడు వచ్చి డబ్బో.. డబ్బని పీక్కు తింటున్నాడు. అనరాని మాటలన్నీ అంటున్నాడు. రంగని కేం వాని కెన్నడూ అప్పిచ్చిన సేటు కనిపించలేదు. వచ్చిన కష్టమంతా లచ్చి కే. దాన్ని ఏమేమో అంటాడు. మానముంటే వారం తిరక్కముందు నాడబ్బు నాకు పడెయ్యండని గొంతుమీద కూర్చుంటాడు. లచ్చి ఎన్నిసార్లని బొంకుతుంది. తన బ్రతుకులో అప్పులవాళ్ల గురించియే తెల్యాదాయె. రంగడు రాగానే నెత్తిన నోరెట్టుకొని చెపుతుంది లచ్చి. కాని రంగడేమీ లక్ష్యపెట్టకుండానే, సరే చూద్దాం అని వెళ్ళిపోతాడు. మధ్యన వచ్చింది లచ్చికి మాత్రమే. రోజూ సంపాదిస్తున్న రూపాయల నేంచేస్తున్నాడో లచ్చికి మాత్రం తెల్యాదు. ఇప్పుడు రంగడు సంపాదించిన డబ్బులను తన దగ్గరే ఉంచుకొంటున్నాడు. అవసరముంటే నాలుగో అయిదో ఇచ్చి లెక్కడుగుతున్నాడు. లచ్చి ఎంత గుట్టుగా కాపురం నడపాలనుకున్నా రద్దిపాలై పోతూనేఉంది. ఆనాడు సేటు వొస్తే 'అయన్నే అడుగు' మని కచ్చితంగా చెప్పి వేసింది. ఇంటి కిరాయదారుక్కూడా అలాగే చెప్పింది.

చాలా రాత్రివరకు సేటు రంగని ఇంటిముందే కూర్చున్నాడు. పదకొండు గంటలైనా రంగడు రాలేదు. ఇంట్లోకి కేకవేసి 'మర్యాదగా చెప్పు

తున్నానమ్మో రేపు పైకం కట్టకపోతే దావా వేయక మాననుʼ అని బెదిరించి వెళ్ళిపోయినాడు. సేటు అట్లా వెళ్ళగానే రంగడు వొచ్చినాడు. ఇంట్లో కాలు బెడుతూనే అగ్గిబుక్కినాడు. 'రండా' అంటూ సిగవెంట్రుకలు పట్టినాడు. త్రాగిన వాసన గప్పుగప్పున కొడుతుంది. లచ్చి విడిపించుకోడానికి ప్రయత్నం చేసింది. రంగనికి మన్ను మిన్ను కనిపించడంలేదు. గజగజ వణుకుతూనే 'అన్నం తింటావా ?'అన్న లచ్చిమాట పూర్తిగాకముందే రంగడు దబదబా నాలుగుతన్ని 'వెంటనే ఇంట్లోనుండి పొమ్మని' గర్జించినాడు. లచ్చి ఎత్తేసుకొస్తున్న దుఃఖాన్ని కడుపులోనే అదిమిపట్టుకుంది. కుక్కిన పేనులాగా ఓ మూలకు కూర్చుంది లచ్చి. రంగని కండ్లు జ్యోతుల్లా వెలుగుతున్నాయి. ముఖమంతా నెత్తురితో చిందులు త్రొక్కుతూంది.

ఇప్పుడు రంగడు ఒక్కొక్కసారి వారం రోజులవరకు కూడా ఇంటికి రావడం లేదు. లచ్చికి బ్రతకడమే బరువైంది. తనేం తప్పుచేసిందని అట్లా బాధ పెడుతున్నాడు. వేళకు కూటి కింట్లో గింజలు లేకున్నా పోరు పెట్టడం లేదు. నీవెందుకిలా త్రాగుతున్నావని అడగలేదు. ఎందుకిలా బాధిస్తున్నాడు వాడు. లచ్చికేమీ అర్థం గాలేదు. ఊరుగాని ఊరికి వొచ్చింది. ఊ అంటే తన్ని అవతలికి నూకి పారేసేట్లున్నాడు రంగడు.

లచ్చికి బలే కష్టమొచ్చింది. ప్రొద్దంతానేమో అప్పులవాళ్ళబాధ, రాత్రంతానేమో మగనితో బాధ. పాపం ఎలక్ట్రిక్ తీగకు అంటుకొన్న పక్షిలా విలవిల కొట్టుకొంటుంది లచ్చి. ఆమె బ్రతుకలా తెల్లవారవలసివచ్చింది. మగనితో దెబ్బలు తిని తిని మోటుబారిపోయింది శరీరం. రాసి రంపాన పెడుతున్నాడు. యమలోకమంటే ఇదేనేమోనని అనుకొంటుంది పాపం అమాయకజీవి లచ్చి.

ఆనాడు రంగడు పెందలకడనే ఇంటికి వచ్చినాడు. రంగడు మూల మలుపు తిరుగుతుండగానే ఎవడో మగవాడు తన ఇంట్లోనుండి బయటికిరావడం కళ్ళారా చూచినాడు. ఒక్కసారే కాళ్ళక్రింద భూమి బద్దలై పోయినట్లు తోచిందతనికి. కండ్లల్లో నిప్పులుచెరిగినవి. ఒళ్ళంతా కోపంతో కంపర మెక్కింది. గడపలో కాలు బెట్టగానే అద్దంముందు కూచొని బొట్టుబెట్టుకుంటున్న లచ్చి కనిపించింది. అగ్నికి వాయువు తోడైనట్లు తన అనుమానానికి ఈ అలంకరణ సరిపోయింది. రంగడు మన మనిషిగాకుండా అయిపోయినాడు. లచ్చిని అలసిపోయేదాకా కొట్టినా రంగనికి కసితీరలేదు. అది ఎంత మొత్తుకున్నా, కాళ్ళ మీదపడి ఎంత ప్రాధేయపడినా విడువలేదు. రంగడు నానాబూతులను తిట్టి

నాడు. నమ్మినందుకు మోసం చేసినావని నిందించినాడు. అతని నిషా అంతా క్షణంలో కర్పూరంలా హరించుక పోయింది. ఇంట్లో ఇక ఒక్క క్షణం ఉండ లేకపోయినాడు. వెంటనే బయటికి వచ్చి రిక్షాతీసుకొని వెళ్ళిపోయినాడు రంగడు.

తనభార్య ఇంతపనిచేస్తుందని కలలోకూడా ఊహించుకోలేదు రంగడు. "తన ప్రాణమే నేనని భావించిన లచ్చి ఇట్లా చేస్తుందా? అబ్బ పట్నం ఎట్లాంటి వాళ్ళని ఎట్లా మార్చివేస్తుంది." రంగడు యోచిస్తూ పోతున్నాడు పిచ్చివాని లాగా. ఇంతట్లో కారు హారను వినిపించింది. మరో క్షణంలో ఏమైపోయిందో రంగనికి తెల్వదు. కాని ఆ రాత్రి ఆస్పత్రిలో తెలిసింది కారు తన రిక్షాకు టక్కరయిందని.

తెల్లవారి భార్యవచ్చింది. కాని రంగడు లచ్చికి ముఖం చూపించలేదు. ఆమె ఎవతో అన్నట్లుగానే మెలగినాడు. ఆమె తనభార్య అన్నమాటనే మరచి పోయినట్లున్నాడు. నిజంగా లచ్చికి అప్పుడు కండ్లలోఎన్నిసురగంగలు ఉప్పొంగినాయో తెలియదు. ఎన్ని అగ్నిపర్వతాలు హృదయంలో భగ్గుమన్నాయో తెలియదు. ముఖంమీద, చేతులమీద, కాళ్ళమీద పూయబడిన సున్నపు మరకలతో వచ్చి రంగని కాళ్ళమీద పడ్డది లచ్చి. తన తప్పేమీలేదని, తన్నెందుకిట్లా శిక్షిస్తున్నావని ఏడుస్తూ అడిగింది. కాని రంగడేమి మాట్లాడలేదు. నీరసంగా వైరాగ్యంతో కూడిన ఒక చిన్ననవ్వును నవ్వినాడు అంతే!

లచ్చిగుండె బేజారెత్తిపోయింది. ఈయన అసలు ఇన్నాళ్ళు తనతో కాపురంచేసిన రంగడేనా అనే అనుమానం కలిగింది. ఇంతగా ఒక్కసారే ఎట్లా మారిపోయినాడో అంతుచిక్కలేదామెకు.

రంగనికి తెలివివొచ్చింది. సాయంత్రానికికల్లా కళ్ళు నులుముకున్నాడు. తనముందు నిల్చున్నది తనభార్యేనా? తను నిన్న చీల్చిచెండాడిన లచ్చియేనా? ఎందుకంత అనుమానంకలిగింది? వాడు రోజూ పైసలకొరకు వొస్తున్నాడని చెపితే నేను వినిపించుకున్నానా? లచ్చికి తను ఇష్టంలేకపోతే చావుముఖంలో ఉన్న నా దగ్గరికి ఆ దెబ్బలతోనే ఎందుకొస్తుంది? యోచనా తరంగాల్లో తరలి పోయినాడు రంగడు. వాడికళ్ళముందు తళుక్కున ఏదో మెరసిపోయింది. అప్రయత్నంగా కళ్ళలో కన్నీరు దుమికింది.

కాళ్ళతో తన్ని వేసిన లచ్చిని దగ్గరకురమ్మని కళ్ళతో సైగచేసినాడు రంగడు. కాటికిపోనున్న లచ్చి ప్రాణం లేచివచ్చింది. [ 47వ పుటలో ]

'వేను ముక్తాచ్ఛహార మధ్యాన వెలయు
హరి వినీల నాయకమణి నంటి- సితస
రః ప్రదేశలో రేదీవరమ్ము నంట ।

'అతడు మధువాక్కునకు పరిహాసకాడు' కాబట్టి అంతటితోనే ఆగిపోలేదు మరి. ఇంకా

'కించి దరుణ కపోలము కెలని పుట్టు
మచ్చనట, శకస్త్రీ కుచ మండలమున
కరగుటకు సిగ్గుపడు చూచుకంబునంట'

ఇంచుమించు తన నాతడు శృంగార రసాధి దేవతగా చేసినాడు. అయితే తనలో తనకొక విచారం కలిగింది -

'హరిమణీందీవరమ్ములు నచ్చమైన
పుట్టుమచ్చయు జూచుకము నివి నేనె
ఆశబలవర్ణ వర్జితమ్మైనదేదా'

అని చివరకు తన జీవితాన్ని ఆమెకు దానం చేస్తూ, దెబ్బైతొమ్మిదో ఖండికలో-

'ఈసుకవినైన నాజన్మ మెల్ల దేవి
అచ్చపు తెలుంగు పడతివైనట్టి నిన్ను
మరల నా తేనెపాటగా గరగడోయ
త్వత్పదార్పితముగ నేను ధారబోతు.'

అంటాడు. పరస్పరమూ ఒకరికొకరు జీవితం అర్పితంచేసికొన్నారు వాళ్ళు. ప్రణయ కవితారథ్యంలోని జంటవెల్గులు.

*(23 పుట తరువాయి)*

"లచ్చి ! నన్ను క్షమించు."

లచ్చి మనసులో నవ్వు దొరలింది. కళ్ళ పాపలను ఆనందబాష్పాలతో

రంగడు ఇంకేమో అనబోతుంటే నోటికడ్డంగా చేతినిబెట్టింది లచ్చి.

కళ్ళల్లోనుండి ముత్యాల్లాగా జాలువారుతున్న కన్నీరును కొంగుతో తుడుచుకుంది. రంగని ముఖమంతా ఆ కొంగుతోనే అద్దింది.

"పచ్చని కాపురంలో చిచ్చుపెట్టిన రిక్షా నాశనమయిందిలే ! ఇక ఎప్పటి లాగా పాతజీవితాన్నే ఆరంభిద్దాం" అన్నాడు రంగడు.

లచ్చి పొరలిపోతున్న ఆనందబాష్పాల నాపలేకపోయింది.

★